కథ

# సీమ 'చిత్రం'



రాజా ప్రొడక్షన్స్ అధినేత రామచంద్రరావు నాకు దైవ సమానుడే! ప్రముఖ రచయిత దగ్గర అసిస్టెంటుగా ఉన్న నన్ను పైకి తీసుకొచ్చింది ఆయనే.

"నమస్కారమండీ!" లోపలికి అడుగుపెడుతూ అన్నాను.

"ఏమయ్యా ఈ మధ్య బొత్తిగా కన్పించడం లేదు.." అన్నారాయన. నవ్వి ఊరుకున్నాను.

"ఈ సినిమా బతుకు పూర్తిగా లాటరీ అయిపోయిందయ్యా! పెద్ద హీరోలను, దర్శకులను నమ్ముకుని తీసినా బోల్తాపడుతున్నాయి. మొన్నటి సినిమా అట్లాగే కొంప ముంచింది. బాగా నష్టమొచ్చినా ముందు సినిమాల పుణ్యమాని బతికిపోయాను. ఈసారి పవర్‌ఫుల్ కథ అందించే బాధ్యత నీదే" అని ఛెయిర్లో రిలాక్స్‌డ్‌గా వాలారు రాజుగారు.

"ఏ సబ్జెక్టు మీదంటారు?"

"ఊఁ... కాలేజీ బ్యాక్ డ్రాప్‌లో కుర్రకారుతో సినిమా తీస్తే బానే వుంటుంది. ఖర్చూ తక్కువ. కానీ, మరీ దరిద్రంగా మన తెలుగుఫీల్డు మొత్తం

ఈ సబ్జెక్టునే పట్టుకుని వేలాడుతోంది." కాసేపు ఆగారాయన. "రాయలసీమ ఫ్యాక్షన్ ఇతివృత్తంగా తీస్తే ఎలా వుంటుంది? ఎలాగూ ఇపుడు సీమ చిత్రాల హవా నడుస్తోందిగా..." అంటూ ఆపారు.

"సీమ కథ... దాన్ని పీల్చి పిప్పి చేశారండి. ఒకటే కథకు లాటరీ వేసుకుంటూ పోయారు. తగిలినట్టల్లా హిట్టయ్యాయి. కానీ గ్యారెంటీ ఇవ్వడం కష్టమే. ఈ మధ్య రెండు మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి కదా! మరో సబ్జెక్ట్ ఏదైనా ఆలోచిద్దాం సార్!" అన్నాను.

కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నారాయన. నా సమాధానం తృప్తినివ్వలేదని ఆయన ముఖకవళికల్ని బట్టి అర్థం చేసుకున్నా.

"నాకు ఫ్యాక్షన్ సబ్జెక్టు మీదే ఆశగా ఉంది. నాకోసం ఓ పని చేయగలవా" రాజు.

"చెప్పండి సార్"

"అనంతపురం జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలు ఎక్కువగా ఉన్న ఊళ్లు తిరిగి చక్కటి కథ తయారుచేయగలవా... ఎందుకంటే నేటివిటీ ఫీలవుతావని" అన్నారు.

ఆయనది మొండిపట్టుదల. ఊకొట్టడం మినహా చేయగలిగింది లేదు.

"ఏం సమస్య లేదు కదా?"

"అబ్బే, లేద్సార్... వెళ్తాను"

"క్యాషియర్‌ని కలిసి వెళ్లు."

"ఫర్లేదు సార్! ముందు వెళ్లనీయండి" అన్నాను.

కాసేపు లోకాభిరామాయణం తర్వాత ఆయన దగ్గర శలవు తీసుకున్నాను.

అనంతపురం బస్టాండులో దిగాను. కోస్తాలో పుట్టిపెరిగిన నాకు, రాయలసీమలో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి.

రవీంద్రకు ఫోన్ చేసి నేను వచ్చినట్టు చెప్పాను. కాసేపట్లో వచ్చి పికప్ చేసుకుంటానన్నాడు.

రవీంద్ర, నేను పూర్వాశ్రమంలో ఒకే పత్రికలో సబ్ ఎడిటర్లుగా ఉద్యోగ జీవితం ప్రారంభించాం. అతనిపుడు అదే పత్రికలో అనంతపురం ఎడిషన్‌కు చీఫ్ సబ్‌గా పనిచేస్తున్నాడు. నేను సినిమావైపు కొట్టుకెళ్లాను.

పది నిముషాల్లో వచ్చేశాడు రవీంద్ర. మాటల్లో ఇల్లొచ్చేసింది. ఫ్రెషప్ అయ్యాక అసలు విషయం చెప్పాను. బదులుగా రవీంద్ర నవ్వాడు. మరేం మాట్లాడలేదు.

"ఏమంటావ్? ఫ్యాక్షన్ మీద మంచి కథ దొరుకుతుందా?" అనడిగా.

"నేను చెప్పడం కంటే నీవెళ్లి చూడటం మంచిది. తాడిపత్రి దగ్గర కొన్ని ఊళ్లున్నాయి. మా కంట్రిబ్యూటర్ శ్రీనివాస్‌కు ఫోన్ చేస్తా. అతను నిన్ను తీసుకువెళ్తాడు" అని చెప్పాడు.

రవీంద్ర దగ్గర శలవు తీసుకుని తాడిపత్రిలో దిగాను. అక్కడినుంచి శ్రీనివాస్, నేను ఓ ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లె చేరుకున్నాం. ఆ పల్లె కాస్త పెద్దదే!

ఫ్యాక్షన్ రాజకీయాలకు సంబంధించి ఓ రీసెర్చి వర్క్ కోసం వచ్చానని అబద్ధం చెప్పాను.

శేఖర్ అని 'సర్పంచ్' మధ్య వయస్కుడు. అతని ఇంట్లోనే బస. శ్రీనివాస్ నన్ను దిగబెట్టి వెళ్లిపోయాడు. భోజనాలకు ఓ చిన్న హోటల్ ఉందట. అయినా శేఖర్ వదలనీయలేదు. ఒక మనిషి తమకేమీ బరువు కాదన్నాడు.

ఇంటిపైన కట్టిన ఒకే ఒక రూం నాకిచ్చారు. ఇల్లు ఊరి చివరకావడంతో అటువైపంతా పొలాలే. బోర్లున్న చోట కాస్త పచ్చదనం, మిగతా అంతా బీడు భూమే! రేపట్నుంచి మన కథాన్వేషణ ప్రారంభిద్దామని విశ్రమించాను. తక్కున నిద్ర పట్టేసింది....

... గోలగోలగా అరుపులు వినబడుతూంటే గబుక్కున మెలకువ వచ్చింది నాకు. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. గబగబా కిందకు దిగాను. ఓ ముప్ఫయి మందిదాకా పోగయ్యారు. గ్రామంలో హత్య జరిగిందని వాళ్ల మాటల్నిబట్టి అర్థమైంది. హత్యజరిగిన చోటుకు నేనూ వెళ్లాను.

మెడ మీదా ఛాతిమీద గొడ్డలివేట్లు పడ్డాయి. రక్తం మడుగులో పడిపోయిన వ్యక్తి లక్ష్మారెడ్డి అట! ఓ గంటకు పోలీసులొచ్చి ఫార్మాలిటీస్ పూర్తిచేశారు.

మధ్యాహ్నం భోజనం చేస్తుండగా శేఖర్ తనే ఈ టాపిక్ లేవదీశాడు. "ఈ హత్య ఎందుకు జరిగిందో తెలుసా సార్!"

"ఎందుకన్నట్టు" చూశాను.

"బోరుబావి కింద ఇతనితో పాటు మరొకరికి హక్కుంది. కరెంటు సరిగా రాకపోవడంతో నీటికోసం వాటాల దగ్గర తేడా వచ్చింది. హత్య చేసిన వాడి పంట వాడిపోయే దశలో ఉంది.



## రెండు రకాల పెళ్లి

ఏడు తరాల క్రితం అమెరికాలో స్థిరపడిపోయిన వారున్నారు. అలాంటి వారు భారతీయ, అమెరికన్ సంస్కృతులకు రెండింటికీ ప్రాముఖ్యమిస్తున్నారు. దీనికి ఉదాహరణగా కెనడాలో వుంటున్న రేమాండ్స్-సిస్టాల పెళ్లిని చెప్పుకోవచ్చు. ముందు హిందూసంప్రదాయం ప్రకారం పెళ్లాడారు. తరువాత అమెరికన్ పద్ధతిలో మళ్లీ పెళ్లి చేసుకున్నారు. వీరి పెళ్లి వేడుకలు ఓ వారం పాటు వైభవంగా జరిగాయి.



అక్కను ఆపుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. వాడు మావాడే! రేపటి పేపర్లు చూడండి. ఎలా రంగులు పులుముతాయో... పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఎ. చేసిన నేను, అన్నేళ్ల చదువులోని ఒక్క పేజీకూడా ఇక్కడ ఉపయోగపడదని తెలుసుకున్నా. కారణం నిరక్షరాస్యత, మూర్ఖపు పట్టుదలలు. కాకపోతే ప్రకృతే ఇపుడు ఫ్యాక్షన్లను అణచివేసింది" అని చెప్పుకొచ్చాడు.

మరుసటిరోజు అతను అన్నట్లుగానే 'పడగ విప్పిన ఫ్యాక్షన్', 'ఫ్యాక్షన్ రాజకీయాలకు అంతం లేదా?' లాంటి శీర్షికల కింద శేఖర్ వర్గం ఈ హత్యకు పాల్పడిందని వార్తలొచ్చాయి.

సాయంత్రం శేఖర్, అతని అనుచరులతో కలసి ఊరు చూడ్డానికి బయల్దేరాను. శేఖర్ పక్కింటి దంపతులకు కవల పిల్లలు. రాముడు, లక్ష్మణుడు. ఈ రెండ్రోజుల్లో వాళ్లు నాకు దగ్గరయ్యారు. వాళ్లూ మారాం చేస్తే వెంటబెట్టుకున్నాం. ఊర్లో అక్కడక్కడా కొన్ని ఇళ్లు కాలిపోయి, శిథిలమై ఉన్నాయి. "వాటి వెనుక ఏ రక్తసిక్తమయిన చరిత్ర ఉందో" అనుకున్నా.

ఊరు దాటాం. దారికి అటూ ఇటూ పొలాలు. బీటలు వారిపోయాయి. వర్షం కోసం ఎదురు చూసి చూసి వాడిపోయిన వేరుశనగ మొక్కలు. ఆ పంటల్ని చూస్తేనే అర్థమవుతుంది. ప్రకృతి సీమ రైతుని ఎంత పేదరికంలోకి నెట్టిందోనని!

ఊరికి కాస్త దూరంలో ఉన్న హైస్కూలులోకి అడుగుపెట్టాం. పిల్లలు ఆడుకుంటున్నారు. నేను, శేఖర్ సిమెంటు చప్టా మీద కూర్చున్నాం. కొంచెం అటుగా శేఖర్ అనుచరులు బీడీలు వెలిగించి బాతాఖానీలో పడ్డారు.

"వర్షాలు చాలా తక్కువ కదూ..." అడిగాను.

"సరైన సమయంలో వర్షాలు పడక నాలుగైదేళ్లు అవుతోంది సార్!" అన్నాడు శేఖర్.

"ఈ పేదరికంతోపాటు ఫ్యాక్షన్స్ కూడా ప్రజలను సగం నాశనం చేస్తున్నాయనుకుంటా!"

మెల్లగా నవ్వి చెప్పాడు శేఖర్, "మీరు బహుశా రాయలసీమ మీద తీసిన ఫ్యాక్షన్ సినిమాలు చూసి ఈ అభిప్రాయానికి వచ్చుంటారనుకుంటా. మిగతా ప్రాంతాలవారు సీమ ప్రజలు రాక్షసులు అనుకునేలా సినిమాలు తీస్తున్నారు సార్. కానీ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా వుంది. హత్యలు కాదు. ఇపుడు ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అప్పులకు, ఆకలికి తట్టుకోలేక కుటుంబాలకు కుటుంబాలే ఆత్మాహుతికి పాల్పడుతున్నాయి. నిజమే! ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో సీమ నెత్తుటిగడ్డగా మారింది. ఇప్పటికీ ఉండొచ్చు, కానీ చాలా చాలా తగ్గిపోయాయి. పెద్ద పెద్ద రైతులే బికార్లయ్యారు. ఫ్యాక్షన్ నడిపిన పెద్దలు ఇప్పుడు ఆదాయమార్గాలు వెతుకుతున్నారు. కాంట్రాక్టులు లాక్కోవడం పైనా, తమ జేబులునింపే ప్రభుత్వ పథకాలపైనా దృష్టి పెడ్తున్నారు. అదీ మేలేమో అన్పిస్తుంది. అనంతపురం జిల్లా ఇలాగైనా కాస్త ప్రశాంతంగా ఉంది. ఇటు రైతుల కడగండ్లు చెప్పనలవి కాదు. కూలీడబ్బులకు, ఎరువులకు, పురుగు మందులకు పోను మిగిలేది అప్పే. అనంతపురం జిల్లాలో కరువు తాండవిస్తోంది. ఏదీ సార్ ఆకలి చావుగురించి ఓ సినిమా తీయమనండి. లేదు... తీయరు... ఎందుకంటే అది కాసులు రాల్చవు కాబట్టి! మనిషి ప్రకోపాలకు ప్రాంతాలతో సంబంధం ఉండదు సార్! ఏం... మిగతా ప్రాంతాల్లో ఈ హత్యలు జరగడం లేదా... ఇంతమంది ఆకలి చావులు చస్తుంటే ఎన్ని ప్రత్యేక కథనాలు వచ్చాయి పత్రికల్లో?! రైతుల గోడును ఎవరైనా పట్టించుకుంటున్నారా...? ఇల్లు కాలి ఏడుస్తున్న వాడి సామెతలా... సీమ ప్రజల బతుకు ఇలా దుర్భరంగా ఉంటే కత్తులతో నరుక్కోవడం తప్ప వేరే పనిలేదని ప్రాజెక్ట్ చేస్తే మా కడుపు మండదా సార్!"

ఆవేశాన్నంతా వెళ్లగక్కాడు శేఖర్. ప్రతీమాటా నన్ను అంటున్నట్టే అన్పించింది. నా మనసు వికలమైంది. రాజుగారి దగ్గర చేతులెత్తేయాలని నిర్ణయానికొచ్చా. కానీ ఒకసారి, చుట్టుపక్కల ఊళ్లు చూడాలని నాలో కుతూహలం పుట్టింది.

వారం రోజులపాటు ఫ్యాక్షన్ లీడర్లను, ప్రజలను కలుసుకున్నాను. ఒకప్పటి ముఠాకక్షల ప్రభావం ఇప్పటికీ చాలా ఉంది. ఆ కుటుంబాలన్నీ పూర్తిగా చితికిపోయాయి. ఈ అనుభవాలను నేను ఏ కథకూ ఉపయోగించుకోకపోయినా తెలుసుకోవాలన్పించింది. వారి ఆదరాభిమానాలు నన్ను కదిలించాయి. నేను



అపరిచితుడినయినా తమకున్న దాంట్లో అతిథిని సంతోషపెట్టాలన్న వారి తపన! వారితో కలిసి తిన్నాను, తాగాను, నవ్వాను, ఏడ్చాను... అందరిలోనూ స్వచ్ఛమైన ఆత్మీయత కన్పించింది.

వారం తర్వాత తిరిగి శేఖర్ ఊరికి చేరుకున్నాను. ఆ సాయంత్రం జరిగిన ఘటన నన్ను కలిచివేసింది. శేఖర్ పక్కింటి దంపతులు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నారు. "కరెంటు బిల్లు, బ్యాంక్ వడ్డీలు, బయటి అప్పులు..." మూకుమ్మడి దాడికి తట్టుకోలేక మరణమే శరణమనుకున్నారు.

"బతుకుతెరువుకోసం వెంపర్లాడుతున్న జీవచ్ఛవాల హృదయవిదారకమైన చిత్రం "సీమ చిత్రం". వీళ్ల చేతుల్లో కత్తులు పెట్టి... ఆ కథలో సినిమా తీయాలా!!" ఒళ్లు జలదరించింది నాకు.

ముక్కుపచ్చలారని ఆ కవలలు కళ్లముందు మెదుల్తూనే ఉన్నారు. గుండె పిండేసినట్లయింది. ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. పొద్దున లేస్తూనే ఒళ్లు సలసలా కాగిపోతోంది. నేను హైదరాబాద్ వెళ్తానన్నాను. శేఖర్ ఒప్పుకోలేదు. ఇంజక్షన్లు, మాత్రలు తీసుకునేసరికి కుదుటపడ్డాను. తర్వాతిరోజు శేఖర్ నాతోపాటు అనంతపురం వచ్చాడు. ప్రయాణంలో నేనెవరో చెప్పి క్షమించమన్నాను. సినీ రచయితకు ఆతిథ్యం ఇచ్చినందుకు అతను సంతోషపడ్డాడు. అనంతపురంలో రవీంద్ర కలిశాడు.

"అంత త్వరగా వెళ్తున్నావ్ కథ తయారైందా?" అడిగాడు రవీంద్ర.

"లేదు నేను అనుకున్న ఆకలి కథలో సినిమా తీస్తే నిర్మాతకు పుట్టగతులుండవు. ఆయన కోరినట్లు ఒక నెత్తుటికథను రాస్తే మనిషిగా నేను చచ్చినట్లు లెఖ్ఖ. నాకు రెండు మంచి(?) ప్లాట్లు దొరికాయి కానీ నాలోని మానవత్వం నన్ను నిలువరించింది. అందుకే వెళ్లిపోతున్నా" అన్నాను.

బస్సు కదుల్తోంది... సెలవు తీసుకుంటుండగా శేఖర్ అన్నాడు. "ఒక చిన్న విన్నపం సార్.. రాయలసీమలోనూ మిగతా ప్రాంతాల్లోనూ మాదిరి మానవ మాత్రులే ఉన్నారు. సీమ ప్రజలు నెత్తుటి కూడు తినే రాక్షసులు ఎంతమాత్రం కాదని మీ రచయితలకు చెప్పండి ప్లీజ్!"

నా కంట్లోంచి కన్నీటిబొట్లు జలజలారాలాయి. సినీ రచయితలా కాక మనిషిగా స్పందించాను. ఈ బాధ నాకు సంతోషాన్నిచ్చింది.

ఏక కాలంలో విషాదనందాలు!

■